# స్టార్టప్.. రేసులో విజయకాంతలు

మంచి ఆలోచన ఉంటే చాలు.. మహిళా పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు అవకాశం కల్పిస్తోంది బెంగళూరు ఐఐఎం. దీనికోసం దేశవ్యాప్తంగా ఉమెన్ స్టార్టప్ ప్రోగ్రాం ప్రారంభించింది. దేశవ్యాప్తంగా పోటీ పెట్టి సృజనాత్మక ఆలోచనలు ఉన్న వందమందిని ఎంపిక చేసింది. వీరికి ఏడాది పాటు శిక్షణ ఇచ్చి పారిశ్రామిక వేత్తలుగా మలిచేందుకు ఇంక్యుబేషన్ కేంద్రాలను ప్రారంభించింది. విశాఖ ఐఐఎం ఇంక్యుబేషన్ కేంద్రంలో పలువురు యువ మహిళా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు శిక్షణ పొందుతున్నారు.



న్యూస్‌టుడే, ఏయూ ప్రాంగణం

**10,000** వచ్చిన దరఖాస్తులు

**6000** పరిగణలోకి తీసుకున్న మంచి ఆలోచనలు

**300** వడపోత తర్వాత ఎంపికైన వారు

**100** అద్భుత ఆలోచనలుగా భావించి తుది ఎంపిక చేసింది

మహిళా యువ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు..

అంకుర దశలో వ్యాపార ఆలోచనలు

### తొలి శిక్షణ బెంగళూరు...

100 మందికి బెంగళూరు ఐఐఎంలో 2వ బూట్ క్యాంప్ నిర్వహించి శిక్షణ ఇచ్చారు. తదుపరి వీరిని తీర్చి దిద్దేందుకు దేశ వ్యాప్తంగా ఈ పథకంలో భాగస్వాములుగా ఉన్న ఐఐఎంలలో ఇంక్యుబేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇవి జూన్ నెల చివర్లో ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగానే ఐఐఎం విశాఖ ఒక ఇంక్యుబేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఈ కేంద్రం పరిధిలో రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు పరిసర రాష్ట్రాలకు చెందిన 26 మంది మహిళలు ఉన్నారు. వీరు తమ వ్యాపార ఆలోచనలకు పదును పెట్టి వాటిని కార్యరూపంలోకి తెచ్చేందుకు సన్నద్ధం అవుతున్నారు.

### దళారీ వ్యవస్థ లేకుండా..



ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నేను ఎంబీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్నాను. కష్టపడి చివరి జాబితాలో నిలిచాను. ప్రతిష్ఠాత్మకమైన ఈ పథకానికి ఎంపిక కావడం ఆనందంగా ఉంది. నా పథకం పేరు ఫార్మ్‌జోన్. రైతును ప్రపంచానికి అనుసంధానం చేయడమే నా వ్యాపార ఆలోచన. రైతుకు, వినియోగదారునికి మధ్య దళారీ వ్యవస్థ లేకుండా నిరోధించడమే ప్రాజెక్టు ఆశయం. వ్యవసాయ, ఉద్యానశాఖల సహకారం తీసుకుంటాం. ఇప్పటికే స్విట్జర్లాండ్ నుంచి ఎగుమతి ఆర్డర్లు మా సంస్థకు ఉన్నాయి.

– రాజమహంతి సౌమ్య వాసంతి. నరసన్న పేట, శ్రీకాకుళం జిల్లా

### సదుపాయాలు..

- ఇంక్యుబేషన్ కేంద్రంలో ఇక్కడ శిక్షణ పొందుతున్న 26 మందికి ప్రత్యేక ఛాంబర్ ఏర్పాటు
- ఏడాది పాటు మహిళలకు నెలకు రూ.30వేలు చొప్పున స్టైఫండ్ అందిస్తారు.
- ఐఐఎం నుంచి అనుభవజ్ఞులైన వారిని మెంటార్‌గా ఏర్పాటు
- వ్యాపార ప్రాజెక్టుకు సంబంధించి సమగ్ర సమాచారం పొందవచ్చు
- మూలధనం నుంచి చేపట్టబోయే వ్యాపారం మార్కెట్‌లోకి వెళ్లేందుకు పూర్తి సహకారం
- ఇంక్యుబేషన్ కేంద్రంలో వైఫై. కంప్యూటర్‌తో పాటు పలు ఆధునిక సదుపాయాలు



ఉమెన్ స్టార్టప్ ప్రోగ్రాం (డబ్ల్యుఎస్‌పి) కోసం దేశవ్యాప్తంగా ఎంపికైన ఔత్సాహిక మహిళా పారిశ్రామిక వేత్తలు

### రసాయన ర'హిత'ం..



రసాయనాలు వాడని ధాన్యం, పప్పు దినుసులు, కూరగాయలు, ఆకుకూరలను రైతు నుంచి సేకరించి వినియోగదారులకు అందించే వినూత్న ప్రాజెక్టు నాది. ఏయూ కంప్యూటర్ సైన్స్‌లో ఎంటెక్ చేస్తున్నాను. మా విభాగాధిపతి ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి ప్రోత్సహించారు. రసాయనరహిత పండ్లు వినియోగదారులకు, ప్రజలకు అందించాలన్న సామాజిక దృక్పథమే నా ప్రాజెక్టు. ఐఐఎం ఇంక్యుబేషన్‌లో శిక్షణకు ఎంపిక కావడం ఆనందంగా ఉంది. దీనికి ఎంపిక కాకుంటే ఉన్నత చదువులకు విదేశాలకు వెళ్లేదాన్ని.

– వి.లక్ష్మీతేజ, సీతమ్మధార, విశాఖ

### బీ-2 కేటగిరి పరిశ్రమలు లక్ష్యంగా...



నేను ఏయూలో ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లో పీజీ పూర్తిచేశాను. దేశంలోని పరిశ్రమలను వివిధ కేటగిరీలుగా విభజిస్తారు. నేను బీ2 కేటగిరి పరిశ్రమలను ఎంపిక చేసుకున్నాను. ఈ సంస్థలు కాలుష్య నియంత్రణ మండలి పరిధిలోనికి వస్తాయి. ప్రాజెక్టు కార్యాచరణలో నిమగ్నం అయ్యా. మహిళా పారిశ్రామిక వేత్తల పథకానికి ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉంది.

– కె.శ్రీనిజ అపర్ణ, లాసన్స్‌బే కాలనీ, విశాఖ

### రివర్స్ లాజిస్టిక్స్...



వ్యాపార సంస్థ తయారు చేసిన వస్తువు వినియోగదారుని వద్దకు వెళ్లి వెనక్కి వస్తుంది. ఇలా రావడాన్ని రివర్స్ లాజిస్టిక్ అంటారు. కొనుగోలుదారు వెనక్కి తిప్పి పంపిన సామగ్రి మా వ్యాపార వస్తువు. చాలా వ్యాపార సంస్థలు, దుకాణాల వద్ద చిన్న చిన్న లోపాలు, సాంకేతిక సమస్యల వల్ల అమ్ముడు కాకుండా మిగిలిపోయే సామగ్రితో నిర్వహించే వ్యాపారం చేసే ఆలోచన నాది. వయసులో చిన్నదానిని కావడంతో తొలుత భయపడ్డాను. ధైర్యంతో పోటీలో నిలిచి విజయం సాధించాను. నా ప్రాజెక్టుకు తుది రూపం ఇవ్వడంలో నిమగ్నమయ్యాను. ఈ పథకానికి ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉంది.

– కొమ్మూరు ఉష, హనుమంతువాక, విశాఖ